ప్రజాశక్తి

ఆదివారం 4 ఫిబ్రవరి 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

కబ్జాకు కుట్ర



- కార్పొరేషన్ స్థలాలు కాజేసేందుకు ఎత్తుగడ
- ఖాళీ జాగా కన్పిస్తే వాలిపోతున్న డేగలు
- రూ.కోట్ల విలువైన ఆస్తులపై షాడో కార్పొరేటర్ల కన్ను
- తెరవెనుక నుంచి కీలక నేత దన్ను-అధికారుల ప్రేక్షకపాత్ర

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్ స్థలాలను కబ్జా చేసి అమ్ముకునేందుకు కొంతమంది కార్పొరేటర్లు ప్రయత్నిస్తున్నారు. కార్పొరేషన్ ఆస్తులను పరిరక్షించాల్సిన వారే వాటిని బినామీ పేర్లతో పేదలకు కేటాయిస్తున్నట్టు చూపి తర్వాత రూ.కోట్ల విలువైన ఆ స్థలాలను తమ వశం చేసుకునేందుకు వేసిన ఎత్తుగడ బెడిసి కొట్టిన వైనం స్థానిక నల్లచెరువులో జరిగింది.

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ కొబ్బరితోటలో మున్సిపాలిటీకి చెందిన 85 సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలంలోని కొంత భాగంలో రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. పక్కనే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయించారు. దాదాపు 65 సెంట్లు ఖాళీగా ఉండటంతో కొంతమంది షాడో కార్పొరేటర్ల కళ్లు వీటిపై పడ్డాయి. నగరంలోని కీలక నేత అండదండలతో ఖాళీ స్థలంలో 200 లారీల మట్టిని తోలించారు. మట్టిని ఎవరు తొలించారో కార్పొరేషన్ అధికారులకు తెలియదంటున్నారు. పట్టణ ప్రణాళిక శాఖ, ఇంజినీరింగ్ అధికారులు మిన్నకుండిపోయారు. రూ.20 లక్షలు ఖర్చు పెట్టి గ్రావెల్ తోలించిన షాడో కార్పొరేటర్ల అనుచరులు స్థానికంగా కొన్ని సామాజిక తరగతులకు తక్కువ ధరకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వ్యూహరచన చేశారు. బినామీ పేర్లతో ఇళ్ల స్థలాలు ఇప్పించి ఈ భూమిని మొత్తంగా కాజేసేందుకు వ్యూహరచన చేశారు. ఇక్కడ గజం 50 వేలు ధర ఉంది. ప్రభుత్వ విలువలో కొంత రిబేటు ఇచ్చి తక్కువ ధరకు స్థలాలు విక్రయించేందుకు ఎత్తుగడ వేశారు. ఈ మేరకు త్వరలో కార్పొరేషన్‌లో తీర్మానం ఆమోదింపచేజేలా ప్రయత్నిస్తున్నారు. ఈ అంశంపై కొంత మంది రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. ఈ అంశం శనివారం మంత్రి విడదల రజనికి కొంత మంది సమాచారం అందించారు. తన నియోజకవర్గంలో ఇలా స్థలాలు కబ్జా చేయడం ఏమిటని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

గుంటూరులోని విలీన గ్రామాల్లో కూడా భూకబ్జాలు పెరుగుతున్నాయి. అంకిరెడ్డిపాలెం, పొత్తూరు ప్రాంతాల్లో ఒక స్థలాన్ని షాడో కార్పొరేటర్ అనుచరులు కబ్జా చేసేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. దీంతో షాడో ▶ 2లో



మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య

రాయలసీమ కంటే వెనుకబడిన పల్నాడు

- వరికపూడిశెల ద్వారా పల్నాడు సస్యశ్యామలం
- ప్రాజెక్టు సాధనకు క్షేత్రస్థాయి ఉద్యమాలు...
- సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన జిల్లాగా ఉమ్మడి గుంటూరు జిల్లా పేరు గాంచిందని, అయితే ఎగువ పల్నాడు ప్రాంతమైన దుర్గి, వెల్దుర్తి, బొల్లాపల్లి, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలాలు కరువు కోరల్లో చిక్కుకుని అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నాయని సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య అన్నారు. వరికపూడిశెల ప్రాజక్టు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. నరసరావుపేటలోని స్థానిక కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో వరికిపూడిశెల జలసాధన సమితి కమిటీ సభ్యుల సమావేశం శనివారం జరిగింది. చలమయ్య మాట్లాడుతూ రాయలసీమ కంటే అత్యంత వెనుకబడిన ప్రాంతంగా పల్నాడు ఉందన్నారు. వెయ్యి అడుగులకు పైగా బోర్లు వేసినా రోజు మొత్తం 3 బిందెల నీరు రావడం కష్టంగా ఉందని, కుటుంబం మొత్తం రోజంతా ఆ ▶ 2లో

8లో సినిమా చూపిస్తూ ఆపరేషన్!

2లో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి



వ్యవసాయంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష

మధ్యంతర బడ్జెట్ ప్రతుల దహనంతో రైతు సంఘం నిరసనలు

ఆన్‌లైన్ బెట్టింగులు, యా(అ)ప్పులకు విద్యార్థి బలి

ప్రజాశక్తి-ఈపూరు



ఆన్‌లైన్ బెట్టింగుల్లో డబ్బులు పోగొట్టుకోవడంతోపాటు యాప్‌లో అప్పులు చేసిన డిగ్రీ విద్యార్థి తీవ్ర మనస్థాపానికి గురై ఉరేసుకున్న ఘటన మండల కేంద్రమైన ఈపూరు పంచాయతీ పరిధి ఎర్రగుంట తండాలో శనివారం వెలుగు చూసింది. పోలీసులు, మృతుని బంధువుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన రామావత్ శ్రీరాములు నాయక్, దేవిబాయి దంపతుల చిన్న కుమారుడైన ▶ 2లో



కలెక్టరేట్‌లో గాంధీ విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు : కలెక్టరేట్‌లోని లుంబిని పార్కులో బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి శనివారం రాత్రి ఆవిష్కరించారు. అనంతరం విగ్రహ ఏర్పాటుకు సహకరించిన బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ వారిని సన్మానించారు. సంయుక్త కలెక్టర్ జి.రాజాకుమారి, డిఆర్‌ఒ కె.చంద్రశేఖరరావు, ఆర్డీవో శ్రీఖర్, పంచాయతీరాజ్ ఎస్‌ఇ బ్రహ్మయ్య, డ్వామా పీడీ వెంకటశివరామిరెడ్డి, జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.రవికాంత్, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు, తహశీల్దార్ సాంబశివరావు, బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దుగ్గిరాల తహశీల్దార్‌గా రవిబాబు

ప్రజాశక్తి - దుగ్గిరాల

దుగ్గిరాల నూతన తహశీల్దార్‌గా కె.రవిబాబు బదిలీపై వచ్చారు. ఆయన సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈయన గతంలో ప్రకాశం జిల్లా బల్లికురవ మండలంలో పని చేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన కె.మల్లీశ్వరి బాపట్ల కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలో జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు యర్రగోపు నాగరాజు అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన మండల కమిటీ సమావేశంలో నాగరాజు మాట్లాడారు. తాడికొండ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బేతపూడి విజయ్‌శేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

అనధికార మద్యం విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - తెనాలి

మద్యాన్ని అనధికారికంగా విక్రయిస్తున్న ఒకర్ని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. ఎస్ఇబి సిఐ ఎవి చలం వివరాల ప్రకారం.. మండలంలోని కోపల్లెకు చెందిన బాణావత్ నాగమల్లేశ్వరరావు మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో శనివారం ఎస్ఇబి బృందం దాడి చేసి అతనిని అదుపులోకి తీసుకుంది. అతని నుంచి 40 సీసాల మధ్యన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అంగలకుదురుకు చెందిన బొల్లు రవి రైల్వే స్టేషన్ సమీపంలో అనధికారికంగా మద్యం వికరిస్తుండగా త్రీ టౌన్ పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని 10 సీసాల మద్యం స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశారు.

రాయలసీమ కంటే వెనుకబడిన పల్నాడు

(మొదటి పేజీ తరువాయి)

నీటితోనే గడుపుకోవాల్సిన పరిస్థితి ఆయా మండలాల్లో ఉందని చెప్పారు. ఈ విషయంలో పాలకులు సిగ్గుపడాలన్నారు. వరికిపూడిశెల ఎత్తిపోతల పథకం కోసం గతంలో సిఎంలుగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, తాజాగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపనలు చేసినా పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగడం లేదన్నారు. రూ.2.50 లక్షల కోట్లకు పైగా రాష్ట్ర బడ్జెట్ రూ.47 లక్షల కోట్ల కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఈ దేశంలో ఖర్చు పెడుతున్నట్లు చెబుతున్నారని, వీటిల్లో వరికిపూడిశెల ప్రాజెక్టుకు నిధులు ఖర్చు పెట్టలేరా? అని ప్రశ్నించారు. ఆర్థికంగా, విద్య, వైద్య పరంగా వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పల్నాడు ప్రాంతంలో బంగారం లాంటి భూములున్నా సాగునీరు లేక భూములు పడావుగా మారాయన్నారు. నాగార్జునసాగర్ నిర్మించిన సమయంలో పార్లమెంట్లో చర్చ జరిగితే నిర్వాసితులందరికీ లిఫ్ట్ ద్వారా నీరు ఇస్తామని పార్లమెంట్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల అవసరాల కోసమే ఆయా రాజకీయ పార్టీల ముఖ్యమంత్రులు వరికిపూడిశెలకు శంకుస్థాపనలు చేశారని విమర్శించారు. ఆయా మండలాల ప్రజలను కదిలించి నందికొండ ప్రాజెక్టు నిర్మాణానికి ఏ విధంగా ప్రజా ఉద్యమం కొనసాగిందో అదే రీతిలో వరికిపూడిశెల కోసం ఉద్యమం చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ వరికిపూడిశెల ఎత్తిపోతల పథకం పల్నాడు ప్రజలకు అందుబాటులోకి వస్తే 100 గ్రామాలకు తాగునీరు, లక్ష ఎకరాలకు పైగా సాగునీరు లభిస్తుందని, వ్యవసాయ బోర్లలో కూడా నీరు పుష్కలంగా ఉంటుందని తెలిపారు. వెనుకబడిన పల్నాడు ప్రాంతం సస్యశ్యామలంగా మారి ఆ ప్రాంత ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని చెప్పారు. ప్రభుత్వ స్పందించి తక్షణమే స్పందించి వరికిపూడిశెల పనులు ప్రారంభించకుంటే కలిసొచ్చే పార్టీలను ఐక్యం చేసి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కౌలురైతు సంఘం మండల కార్యదర్శి కె.ఆంజనేయులు, వరికిపూడిశెల జలసాధన సమితి కమిటీ సభ్యులు కె.హనుమంతరెడ్డి పి.శ్రీను, బి.వీరయ్య, బి.సుబ్బారావు, బి.గురువులు పాల్గొన్నారు.

ఓపీఎస్ పునరుద్ధరణపై వైఖరి చెప్పాలి





ప్రజాశక్తి - తుళ్లూరు, చేబ్రోలు

సిపిఎస్ రద్దు, ఒపిఎస్ పునరుద్ధరణపై రాజకీయ పార్టీలు తమ వైఖరి వెల్లడించాలని, ఒపిఎస్ అమలు చేసేవారికే తమ ఓటు అని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఓట్ ఫర్ ఒపిఎస్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి, ఒపిఎస్ జిల్లా కన్వీనర్ సిహెచ్ ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం మండల విద్యా వనరుల కేంద్రం వద్ద క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎన్నికల సందర్భంగా సిపిఎస్ రద్దు - ఒపిఎస్ అమలు హామీని జగన్ అధికారంలోకి వచ్చాక విస్మరించారని అన్నారు. కొత్తగా తెచ్చిన జిపిఎస్ విధానం ఉద్యోగులకు ఏమాత్రం ప్రయోజనకరం కాదని, పాత ఫెన్షన్ విధానం మాత్రమే మేలని చెప్పారు. కార్యక్రమంలో ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వర్లు, టి.పూర్ణచంద్రరావు, టి.ఉమామహేశ్వరరావు, సుజాత కుమారి, జ్యోతి పాల్గొన్నారు. మండలం కేంద్రంమైన చేబ్రోలులోని నడింపేట ఉర్దూ ప్రాథమిక పాఠశాల వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు రమేష్‌బాబు, డి.నాగేశ్వర రావు, కోశాధికారి కె.శ్రీనివాసరావు కార్యదర్శులు అర్సతున, శ్రీనివాసరావు, విజయరాజు ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీరామమూర్తి, జిల్లా కౌన్సిలర్లు రమణ రావు, రత్నశేఖర్‌బాబు, చాయనా థవర్మ పాఠశాల కమిటీ సభ్యులు సిరాజ్, జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర విజేతలకు బహుమతులు



ప్రజాశక్తి-గుంటూరు : ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి, అత్యున్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న మహోన్నత లక్ష్యంతో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా పోటీల ముగింపు, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,45,929 మంది క్రీడాకారులు పోటీలకు నమోదు చేసుకున్నారన్నారు. పోటీలను సక్రమంగా నిర్వహించిన సచివాలయ సిబ్బంది, మండల, జిల్లా స్థాయి అధికారులు, కోచ్‌లకు అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు విశాఖ పట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. జిల్లా స్థాయి పోటీలలో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌కు క్రీడలకు మొదటి బహుమతి రూ.60 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, బాడ్మింటన్ మొదటి బహుమతి రూ.35 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు అందజేశారు.

మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సమావేశం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు వైద్య కళాశాల 1981 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం శనివారం జింకాన ఆడిటోరియంలో జరిగింది. తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ దేశాలలో స్థిరపడిన అప్పటి పూర్వ విద్యార్థులు కలుసుకొని తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దాదాపు 42 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా పాటలు పాడుతూ అప్పటి విద్యార్థులు మాదిరిగా చలోక్తులు వేసుకుంటూ సందడి చేశారు. ఆనాటి పూర్వ విద్యార్థులైన టిటికె రెడ్డి, సుందరచారి ప్రస్తుతం గుంటూరు మెడికల్ కళాశాల, మచిలీపట్నం మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాళ్లుగా ఉన్నారు. ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిరణ్ కుమార్ ఉన్నారు. వీరిని ప్రత్యేకంగా సత్కరించారు. చనిపోయిన పూర్వ విద్యార్థులకు నివాళిగా రెండు నిముషాలు మౌనం పాటించారు. జింకనా ప్రతినిధి డాక్టర్ పొదిల వెంకట ప్రసాద్ ప్రభుత్వ ఆసుపత్రికి అందించిన ఆరు కోట్ల సహాయాన్ని అందించడాన్ని ప్రతి ఒక్కరు ప్రశంసించారు. మరో రూ.రెండు కోట్లు ఇవ్వడడానికి ముందుకు రావడం అభినందనీయమని డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ మస్తాన్, కృష్ణ జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని, తెలంగాణ చెస్ట్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహమ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగులు, యా(అ)ప్పులకు విద్యార్థి బలి

(మొదటి పేజీ తరువాయి)

బాలస్వామి నాయక్ వినుకొండలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఓ పక్క చదువుకుంటూనే పుచ్చకాయల వ్యాపారం చేస్తుంటాడు. సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ రుణాలకు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకోవడంతోపాటు, ఆన్‌లైన్‌లో తీసుకున్న అప్పులు చెల్లించలేక తీవ్ర ఒత్తిడికి లోనయ్యాడు. ఈ విషయమై బంధువుల వద్ద వాపోయినట్లు సమాచారం. ఈ క్రమంలోనే బాలస్వామి జనవరి 26వ తేదీ నుండి కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తండావాసులు చుట్టుపక్కల వాకబు చేసిన ఆచూకీ లభించకపోవడంతో తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో శనివారం గాలిస్తుండగా దుర్వాసన వచ్చింది. దీంతో అక్కడికెళ్లి పరిశీలించగా చెట్టుకు ఉరితో బాలస్వామి మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ సిబ్బందితో ఘటన ప్రాంతానికి చేరుకొని వివరాల మేరకు కేసు నమోదు చేసి ప్రభుత్వ వైద్యులను పిలిపించి పోస్టుమార్టం నిర్వహించారు.

కబ్జాకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేటర్ రంగ ప్రవేశం చేసి దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. గోరంట్లలో తూర్పు బజారులో ఉన్న వాటర్ ట్యాంకుకు 300 మీటర్ల దూరంలో నిర్మాణాలు, గృహ సముదాయాలు ఉండకూడదనే మున్సిపల్ చట్టాలకు తిలోదకాలిచ్చి టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇటీవల కొన్ని అక్రమ నిర్మాణాలకు అనుమతిచ్చారు. వార్డు ప్లానింగ్ కార్యదర్శి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లను మ్యానేజి చేసి షాడో కార్పొరేటర్ చక్రం తిప్పారని సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా ఈ ప్రాంతంలో నిర్మించిన రేకుల షెడ్డులకు మౌఖిక అనుమతులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. నగరంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కమిషనర్ దృష్టికి రాకుండా ఒక కీలక నేత మద్ధతుతో టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు వ్యవహారాలన్ని చక్కబెడుతున్నట్టు తెలిసింది. కమిషనర్ విచారణ జరిపితే కిందిస్థాయి సిబ్బందిని బాధ్యులుగా చేసి సంబంధిత విభాగాల కీలక అధికారులు తప్పించుకుంటున్నారనే వాదన కార్పొరేషన్‌లో విన్పిస్తోంది.

గిరిజనులపై షాడో కార్పొరేటర్ అనుచరుల దాడి

గుంటూరులోని చంద్ర రాజేశ్వరరావు నగర్‌కు చెందిన గిరిజన నాయకులు ఎన్.దేవానాయక్ పై శుక్రవారం రాత్రి 26వ డివిజన్‌కు చెందిన కార్పోరేటర్ శ్యామల వెంకటరమణాదేవి భర్త బ్రహ్మారెడ్డి అనుచరులు దాడి చేసినట్టు గిరిజన సంఘ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ ఆరోపించారు. దాడిలో గాయపడిన దేవానాయక్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన శనివారం పరామర్శించారు. బ్రహ్మారెడ్డి పెత్తనం ఎక్కువైపోయిందని గ్రావెల్ మాఫియాను పెంచి పోషించడమే కాకుండా భూ కబ్జాలకు పాల్పడుతున్నారని శ్రీనునాయక్ తెలిపారు. దేవా నాయక్ మాట్లాడుతూ పలు పర్యాయాలు నన్ను ఇబ్బంది పెట్టడమే కాకుండా నా ఇంటి మీదకు బ్రహ్మారెడ్డి అనుచరులు మారణ ఆయుధాలతో దాడి చేయడం వల్ల చేతికి 15 కుట్లు పడ్డాయని, నా కుమారుని పెదవికి 5 కుట్లు పడ్డాయని, మరో కుమారునికి, నా భార్యకు గాయాలయాయని వివరించారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

పేదలందరికీ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, కులగణన అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీవో, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులతో కలెక్టరేట్ నుండి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జనవరి 27వ తేది నుండి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ మొదలైందని, 9వ తేదీ నాటికి పూర్తి చేయాలని చెప్పారు. పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి జిల్లాలో 1,46,280 మందిని మ్యాపింగ్ చేయాల్సి ఉండగా, 1,36,044 మందిని మ్యాపింగ్ చేశారని, ఇంకా 10,236 మందిని చేయాల్సి ఉందని తెలిపారు. డేటా రిఫ్లెక్ట్ అయి రిజిస్ట్రేషన్ కాని వాటిని వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. వీఆర్ఓలు సంబంధిత సచివాలయల్లో ప్రత్యక్షంగా విధుల్లో వుండేలా చూడాలన్నారు. బయోమెట్రిక్ ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేపట్టాలని, సర్వే, ప్లాట్ నంబర్లు, పేర్లు వివరాల నమోదులో తప్పులు లేకుండా చూడాలని చెప్పారు. అధికారులు ఆయా మండలాల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల డేటా, లబ్ధిదారుల వివరాలు వారికి కేటాయించిన ప్లాట్లు తదితర అంశాలను పరిశీలించి రిజిస్ట్రేషన్ చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలో సంయుక్త కలెక్టర్ నేతృత్వంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షిస్తామన్నారు. తాడేపల్లిలో పంపిణీ చేయాల్సిన 3,777 వైయస్సార్ ఆరోగ శ్రీ కార్డులను వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. వైద్య కార్డులు పంపిణీ చేసేటప్పుడు ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ఆరోగ్యశ్రీ యాప్‌ను మొబైల్ ఫోన్లలో డౌన్లోడ్ చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డుల ఈకెవైసీ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. జెసి జి.రాజాకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఆర్డిఓ శ్రీఖర్ పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో ఎస్‌పి తనిఖీ



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా ఎస్‌పి తుషార్ దూడి శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో వున్న వివిధ విభాగాలకు చెందిన ప్రాంతలలో ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా కార్యాలయంలో వున్న రూరల్ జిల్లా పోలీసు కార్యాలయం, చిల్డ్రన్ రీడింగ్ రూం,ఎఆర్ డ్యూటీ ఆఫీసర్ రూం, కమ్యునికేషన్ ప్రాంతం, వివిధ విభాగాలను పరిశీలించారు. అత్యవసర సమయంలో ఉపయోగించే పరికరాలకు సంబంధించిన పోలీస్ గుడారాలను నిల్వ ఉంచే ప్రాంతాలను పరిశీలించారు. డిఎస్‌పి శ్రీనివాసరావు, ఆర్‌ఐలు థామస్ రెడ్డి, రమేష్‌కృష్ణన్, స్పెషల్ బ్రాంచ్ సిఐ వెంకటరావు పాల్గొన్నారు.

రాజధాని లేని రాష్ట్రం : టిడిపి



ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ఎన్నికల ముందు రాజధానిని మార్చబోమని, అమరావతి ని అభివృద్ధి చేస్తామని చెప్పిన సిఎంజగన్ అధికారంలోకి వచ్చిన తరువాత మూడు రాజధానుల పేరుతో రాజధాని లేని రాష్ట్రంగా మార్చారని గుంటూరు తూర్పు నియోజకవర్గం ఇంచార్జి మొహమ్మద్ నసీర్ విమర్శించారు. శనివారం సాయంత్రం తూర్పు నియోజక వర్గం 51వ డివిజన్ శారదా కాలనీ ప్రాంతంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.

'మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ'

.ప్రజాశక్తి - నరసరావుపేట

సిఎం జగన్ రెడ్డి విడుదల చేసింది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అని నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు విమర్శించారు. నరసరావుపేటలోని టిడిపి కార్యాలయం లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 50,892 టీచర్ పోస్టులు ఖాళీలు ఉంటే 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను వంచించడమేనన్నారు. ఎన్నికల దృష్ట్యా జగన్ రెడ్డి కొత్త డ్రామాకు తెర లేపారని నిరుద్యోగులు మరొకసారి వంచించి అధికారంలోకి రావడమే లక్ష్యంగా నోటిఫికేషన్ డ్రామాలాడుతున్నా రన్నారు. జగన్ నిర్వాకం వల్ల దేశంలో 11 శాతం నిరుద్యోగం ఉంటే రాష్ట్రంలో 24 శాతం నిరుద్యోగం ఉందని, యువతను నమ్మించి అధికారంలోకి వచ్చి ఆంధ్రప్రదేశ్ ను నిరుద్యోగ ఆంధ్ర ప్రదేశ్ గా జగన్ రెడ్డి మార్చారని మండిపడ్డారు. కల్తీ మద్యం అమ్మకాలతో మద్యాంధ్రప్రదేశ్ గా,గంజాయి అమ్మకాలతో గంజాయి ఆంధ్ర ప్రదేశ్ గా మార్చిన ఘనత జగన్ రెడ్డిదేనని విమర్శించారు.పోలీసులే గంజాయి స్మగ్లర్లుగా మారితే ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉంటుందాని వాపోయారు.



మాట్లాడుతున్న చదలవాడ అరవిందబాబు

నిరుద్యోగులకు మరోసారి మోసం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్‌సి ద్వారా నిరుద్యోగులను మరోసారి మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. గుంటూరులోని తన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఎన్నికలకు నెలరోజుల ముందు మెగా డిఎస్‌సి పేరుతో నిరు ద్యోగులను మోసం చేసేందుకు సిఎం జగన్ కొత్త డ్రామాకు తెర తీశారన్నారు. రాష్ట్రంలో 2.32 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని 2019 ఎన్నికల ప్రచారంలో చెప్పిన జగన్ ఒక్క నోటిఫికేషన్ అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ఉద్యోగాలు, ఉపాధి కల్పించలేని జగన్ రెడ్డి చేతగానితనంతో రాష్ట్ర వ్యాప్తంగా 1745 మంది యువత బలవన్మరణాలకు పాల్పడ్డారని గుర్తుచేశారు.

మద్యం అక్రమ విక్రయం - అదుపులో ఒకరు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

ఐదు క్వార్టర్ బాటిల్స్‌ను ప్రత్తిపాడు వైన్ షాపులో కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు తీసుకొని వెళుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు గాండ్ల సాంబశివరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పెదనందిపాడు ఎఎస్‌ఐ నార్నె శ్రీనివాసరావు తెలిపారు. మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండలంలోని జిజి పాలెం-రావిపాడు గ్రామాల మధ్య వాహనాలు తనిఖీ చేస్తుండగా సాంబశివరావును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.



మట్కా ఆడుతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మట్కా ఆడితే కఠిన చర్యలు తప్పవని పొన్నూరు అర్బన్ సిఐ బి.భాస్కర్ హెచ్చరించారు. శనివారం పొన్నూరు పట్టణ లో ని బాపట్ల బస్టాండ్ వద్ద మట్కా ఆడుతున్న ఐదు గురు వ్యక్తులను సిబందితో కలసి అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.2750 .నగదును స్వాధీన పరచుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలైన జూదం, మట్కా పేకాట, కోడిపందాలు నిర్వ హించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

సీట్ల ఎంపికలో సామాజిక న్యాయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

అభ్యర్థుల ఎంపికలో సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయం పాటిస్తున్నారని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. శనివారం పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో విలేకరల సమావేశం నిర్వహించారు. నర్సరావుపేట పార్లమెంట్ ఇన్ ఛార్జ్ గా మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ని నియమించడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నాయన్నారు. కానీ, సీఎం జగన్ మాత్రం వారికి రాజ్యాధికారం అందేలా చేస్తున్నామన్నారు. పార్లమెంట్ స్థానంలో ఇప్పటివకకు అగ్రవర్ణాల వారే పోటీ చేశారన్నారు. అందుకే నరసరావుపేట పార్లమెంటును బీసీలకు కేటాయించారు అన్నారు. పార్టీని వీడిన వాళ్ల గురించి ఆలోచించబోమని స్పష్టం చేశారు. పెదకూరపాడు నుంచి వైసీపీ తరపున ఎమ్మెల్యేగా మరల పోటీ చేస్తానన్నారు.



గ్రామాభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-వినుకొండ

మండలంలోని తిమ్మాయపాలెం గ్రామం లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవ నం, వైయస్సార్ రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ హెల్త్ సెం టర్ లను శనివారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామంలో అభివృద్ధి చేయాలనే ఆలోచనకు గ్రామ ప్రజలు సహకరించాలని తెలిపారు. అలా కాకుండా అభివృద్ధి కి అడ్డుకట్ట వేయాలని చూస్తే మనకే నష్టం అని అన్నారు. పట్టణానికి తాగునీటి సమస్యను పరి ష్కరించేందుకు 70 ఎకరాలుగా ఉన్న సింగర చెరువును 272 ఎకరాలుగా విస్తరణ చేసి మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలిపారు. నేను పుట్టి పెరి గిన నా ప్రాంతానికి నా వంతుగా చెప్పుకోదగిన అభివృద్ధి పనులు, ప్రజలకు మేలు చేయాలనేదే తన ఆశయమని, అందుకు ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు అందించాల కోరారు.



రిజిస్ట్రేషన్‌ను త్వరగా పూర్తి చేయండి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని మాదల, ముప్పాళ్ల గ్రామ సచి వాలయాలను సత్తెనపల్లి నూతన ఆర్‌డిఒ వి.మురళీకృష్ణ శనివారం సందర్శించారు. పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులకు పట్టా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ పక్రియలో ఎదుర్కొంటున్న సర్వర్ సమస్యను సబ్ రిజిస్ట్రార్‌కు తెలియజేయాలనీ, ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. డిప్యూటీ తహశీల్దారు లక్ష్మిప్రసాద్, ఆర్‌ఐలు కపిల్‌దేవ్, పవన్ కుమార్, విఆర్వోలు అశోక్, హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు ఆర్.నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయంలో మాట్లాడుతూ ఆర్డీఓ మురళీకృష్ణ

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల పరిశీలన

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సౌకర్యాలను పరిశీలించాలని సత్తెనపల్లి ఆర్డీఓ వి.మురళీకృష్ణ, బిఎల్‌ఓల ను ఆదేశించారు. సత్తెనపల్లి ఎంపిడిఓ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఓటు హక్కు దరఖాస్తు ఫారాలను విచారణ జరిపి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. తొలిగింపు కోసం పెట్టిన ఫారం 7 దరఖాస్తులను క్షుణ్ణంగా విచారించాలని ఆదేశించారు.ఎన్నికల కమిషన్ నియమనిబంధనలు పాటించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో తప్పొప్పులను ప్యూరిపికేషన్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బంది బోసుబాబు పాల్గొన్నారు.



మరణించిన స్నేహితుడి కోసం రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మృతి చెందిన తమ స్నేహితుడు గుంటి ప్రతాప్ జ్ఞాపకార్థం అతని స్నేహితులు శనివారం విజయపురిసౌత్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. గత ఏడాది మే 9 న రోడ్డు ప్రమాదంలో ప్రతాప్ మృతి చెందాడు. ప్రతాప్ జయంతి రోజు న నిర్వహించిన ఈ కార్యక్రమంలో 40 మంది రక్తదానం చేశారు. అనంతరం కేక్ ను కట్ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా ప్రతాప్ స్నేహితులు మాట్లాడుతూ అందరితో సరదాగా ఉంటూ కష్ట నష్టాల్లో పాలు పంచుకొనే స్నేహితుడు తమతో లేక పోవడం బాధగా ఉందన్నారు. కార్యక్రమంలో టి.రాహుల్, రేవంత్, నాగయ్య, కానిస్టేబుల్ విజయ్,సందేశ్, రాజు,సాయి రంగా,ఓంకార్, లారెన్స్, సాయి,దీపక్, రాజేష్,నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉధృతి పెరిగింది.. నియంత్రణ తగ్గింది..

- డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- నిలిచిపోతున్న మురుగునీరు
- పాతవైన రెండు మిషన్లతోనే ఫాగింగ్



విశ్వనాథ్ సెంటర్‌లో మురుగునీటి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలో దోమల ఉధృతి పెరిగింది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, మురుగు నీరు ఎక్కడికక్కడ నిలుస్తుండడంతో అవన్నీ దోమల ఆవాసాలుగా మారుతున్నాయి. ఇల్లు, కార్యాలయం, రహదారి, దుకాణం.. ఇలా ఎక్కడ రెండు నిముషాలు నిల్చోవాలన్నా దోమల దాడికి జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చిన్న చిన్న ఇళ్లల్లో ఉండే సామాన్యులు, దోమల నియంత్రణకు ప్రత్యేక రక్షణ పరికరాలు వాడుకోలేని పేదల పరిస్థితి దయనీయంగా మారింది. కండి నిండా నిద్రకూ దూరమయ్యామని వారు వాపో తున్నారు.

పట్టణంలో 10-15 ఏళ్ల కిందట అప్పటి జనాభాను దృష్టిలో పెట్టుకుని దోమల నివారణకులో కీలకమైన ఫాగింగ్ మిషన్లు రెండింటిని మున్సిపల్ అధికారులు కొన్నారు. అప్ప ట్లో పట్టణ జనాభా సుమారు 50 వేలు కాగా 18 వార్డు లుండేవి. పట్టణాన్ని రెండు జోన్‌లుగా విభజించి 9 వార్డులకు ఒక ఫాగింగ్ మిషన్ చొప్పున కేటాయించారు. మూడ్రోజుల కోసారి డీజి ల్‌తో కలిపిన మలా థియాన్ /సైపర్ మైత్రిన్ అనే మందును చల్లించేవారు. మురుగు కాల్వల్లోని దోమల గుడ్లు అభివృద్ధి కాకుండా బిటిఐ అనే పౌడర్‌ను లేదా అపేట్ అనే పౌడర్‌ను నీళ్లలో కలిపి పిచికారి చేసేవారు.

కానీ ప్రస్తుతం చిలకలూరిపేట పట్టణం స్వరూపమే మారిపోయింది. గణపవరం, మానుకొండువారిపాలెం, పసుమర్రును మున్సిపాల్టీలో విలీనం చేశారు. దీంతో పట్టణ జనాభా 1.25 లక్షల వరకూ పెరిగింది. వార్డులు 38 అయ్యాయి. గతంలో ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేసినప్పుడు పెట్టుకున్న దామాషా ప్రకారం ఇప్పుడు పట్టణానికి 8 యంత్రాలు అవసరం అవుతాయి. అయినా పాతవైన రెండు మిషన్లతోనే ఫాగింగ్‌ను నెట్టుకొస్తున్నారు. ఆ యంత్రాలు కూడా సరిగా పని చేయడం లేదు. గతంలో మూడు నాలుగు రోజులకు ఒకసారి ఫాగింగ్ చేయగా ప్రస్తుతం నెలకు ఒకసారి కూడా చేయడం లేదు. వీలీన గ్రామాలను కాకుండా పాత పట్టణం వరకు నాలుగు డివిజన్లుగా చేసి ప్రతి డివిజన్‌కు ఒక మిషన్‌ను కేటాయించాలని, వీలీన గ్రామాలైన గణపవరానికి రెండు, మానుకొండవారిపాలేనికి ఒకటి, పసుమర్రుకు ఒకటి చొప్పున ఫాగింగ్ యంత్రాలు కొనాలనే డిమాండ్ వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 'దోమలపై యుద్ధం' పేరుతో సుమారు 5 వేల జనాభాకు 20 లీటర్ల డీజిల్, 10 లీటర్ల నీళ్లు, 25 మీల్లీ లీటర్లు మలా థియాన్ మందును కలిపి ఫాగింగ్ చేయించే వాళు ..మలథియాన్ మందు అందుబాటులో లేకుంటే 10 లీటర్ల డీజిల్‌లో సైపర్‌మైత్రిన్ 160 మిల్లీ లీటర్లు, 10 లీటర్ల నీటితో కలిపి ఫాగింగ్ చేయిం చేవారు. దీనికి 5 లీటర్ల పెట్రోల్ పడు తుంది. అంతే కాకుండా కాల్వల్లో ఉండే దోమల గుడ్డు (లార్వా) ఎదగకుండా చని పోయేందుకు 10 లీటర్ల నీటిలో బిటిఐ పౌడర్‌ను గానీ లేదా అపేట్ పౌడర్ కానీ 20 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయించేవారు. ప్రస్తుతం ఈ పనులూ సరిగా చేయడం లేదని పట్టణ వాసులు విమర్శిస్తున్నారు. కేవలం ప్రముఖులు, అధికారుల ఇళ్ల వద్ద, ప్రత్యేక కార్యక్రమాల వద్ద మాత్రమే ఫాగింగ్ చేస్తున్నారని, మిగతా పట్టణాన్ని పూర్తిగా విస్మరించారని పలువురు ఆరో పిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాల్టీ స్పందించకుంటే పట్టణ ప్రజలు రోగాల బారినపడక తప్పదని ఆందోళనకు గురవుతున్నారు.

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సంయుక్త కిసాన్ మోర్చా, అఖిలభారత ట్రేడ్ యూనియన్ల సమైక్య పిలుపు మేరకు ఈ నెల 16న ఐదు రైతు సంఘాలతో కలిసి దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయలపాటి శివనాగ రాణి పిలుపునిచ్చారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షులు కారుచోల రోశయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శివ నాగరాణి మాట్లాడుతూ ఈ బంద్‌లో వ్యవసాయ కూలీలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఉపాధి హామీకి బడ్జెట్‌లో తగ్గించిన నిధులను, పని దినాలను పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధానంగా పల్నాడు జిల్లాలో కరువు ఛాయలు అలముకున్నాయని, వ్యవసాయ కూలీలు పనులు లేక అర్థాకలితో అలమటిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ కూలీలలో భరోసా నింపాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కూలీలు వలసలు వెళ్లడం వలన వారి పిల్లల చదువు దెబ్బతింటుందని వలసలు వెళ్లే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారని వలస ప్రాంతాల్లో బానిసత్వంగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తక్షణమే ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ కూలీలకు పనులు 200 రోజుల పని దినాలు కల్పించాలని రూ.600 వేతనం ఆహార భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుమల లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కూలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ పథకం బడ్జెట్ లో నిధులు పెంచి ఆదుకోవాలని, వలసలు నివారించేందుకు కృషి చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివ నాగరాణి

సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కొమ్ముల నాగేశ్వరరావు, సాతులూరి లూథర్, దావల అన్నపూర్ణ, జడ రాజకుమార్, గంటెల చిన్నప్ప, ఏపూరి వెంకటేశ్వర్లు, కంచర్ల నాగేశ్వరరావు, పఠాన్ సైదా ఖాన్, ఈ ఊరి లక్ష్మారెడ్డి, పెనుమాల ఆశీర్వాదం, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'అడుదాం ఆంధ్ర' విజేతలకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి-వినుకొండ



పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పల్నాడు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ఆటల్లో రానించే విధంగా ప్రభుత్వం తరపున ఇలాంటి పోటిల నిర్వహించే క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు దోహదపడుతుందని అన్నారు.త ఆటల వలన శరీర వ్యాయామం కలిగి అరోగ్యం మెరుగుపడేందుకు దోహదపడుతుందని తెలిపారు. మట్టిలోని మానిక్యాలను వెలికి తీసి క్రీడల్లో ప్రపంచ స్థాయి కి ఎదిగేందుకు వీలు కలుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే తో పాటు సంభంధిత శాఖ అధికారులు, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..




ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణకు సత్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి ప్రభుత్వ హాస్పటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణకి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా స్థానిక గవర్నమెంట్ హాస్పటల్‌లో డాక్టర్లు, సిబ్బంది అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా వైద్యాధికారి బివి రంగారావు విచ్చేశారు. రామకృష్ణ దంపతులను పూల దండలతో ఘనంగా సన్మానించి, సన్మానపత్రం, జ్ఞాపికను అందజేశారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సత్తెనపల్లి ఏరియా హాస్పిటల్ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడంలో రామకృష్ణ తనదైన ముద్ర ఏర్పరచుకున్నారని, ఆయనకు డాక్టరేట్ రావడం సముచిత స్థానం కల్పించడమేనని కొనియాడారు. అనంతర పల్నాడు జిల్లా వైద్యాధికారి బివి రంగారావు , కొత్త రామకృష్ణ మాట్లాడారు.

శ్రీచక్ర సిమెంట్స్‌కు అవార్డు

ప్రజాశక్తి-కారంపూడి



మండలంలోని పేట సన్నిగండ్ల పరిధి, లోని శ్రీచక్ర సిమెంట్స్ గత మూడేళ్ల నుండి మంచి నాణ్యత ప్రమా ణాలు పాటిస్తున్నందుకు గాను భారతీయ ప్రమాణాల సంస్థ అప్రిసియేషన్ అవార్డు ప్రకటించింది. ఈ విషయాన్ని సంస్థ ఎండి విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. తమ సంస్థపై నమ్మకంతో ఉంటూ, ప్రోత్సాహించిన వినియోగదారులకు, డీలర్లకు కృతజ్ఞతలు తెలిపారు.


BUREAU OF INDIAN STANDARDS

Certificate of Appreciation

SRI CHAKRA CEMENTS LIMITED

Ordinary Portland Cement

వ్యవసాయంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష

మధ్యంతర బడ్జెట్ ప్రతుల దహనంతో రైతు సంఘం నిరసనలు

ప్రజాశక్తి-తాడేపల్లి, దుగ్గిరాల

వ్యవసాయ రంగానికి నిధులు కేటాయించడంతో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జె.శివశంకరరావు, ఉపాధ్యక్షులు పాశం రామారావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ప్రతులను శనివారం ఉండవల్లి సుందరయ్య చౌక్‌లో, నేతాజి సెంటరల్లో, మండల కేంద్రమైన దుగ్గిరాలలో దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు తీవ్ర ద్రోహం చేసిందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని స్వదేశీ విదేశీ కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టడానికి ప్రయత్నించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార భద్రత, ఉపాధి అవకాశాలు, ఎరువుల మీద సబ్సిడీలకు నిధులు కేటాయించకుండా కోతలు విధించారని తెలిపారు. బడ్జెట్ భాగస్వామ్యాన్ని పెంచి కార్పొరేట్లకు ఉపయోగపడే విధంగా ఉన్నదని సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోలేదన్నారు. విశాఖ ఉక్కు రాజధాని నిధులు పోలవరం నిర్వాసితుల నిర్వాసితుల ప్రస్తావన బడ్జెట్లో లేదన్నారు. రాష్ట్రానికి మరోసారి అన్యాయం జరిగిందని విమర్శించారు మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి కార్పొరేట్లకు ఊడిగం చేయడానికి ఈ ప్రభుత్వ సిద్ధమైందని మండిపడ్డారు. ఏడాది పాటు సాగిన రైతాంగ ఉద్యమంతో నల్లచట్టాలు వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మరో రైతాంగ పోరాటం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. పంటలకు మద్దతు ధరతో పాటు 50 శాతం అదనంగా బోనస్ ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16వ తేదీన జరిగే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఇటీవల జరిగిన కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులకు ప్రస్తుత ధరల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని బాధితుల కమిటీ కన్వీనర్ బి.వెంకటరామయ్య, కో-కన్వీనర్ కె.వెంకటేశ్వరావు కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాజధాని అధ్యక్షులు కె.జగదీశ్వరరెడ్డి, టి.బక్కిరెడ్డి, కోటేశ్వరరావు, ఇ.రామారావు, గాంధీ, డి.శ్రీనివాసరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, డి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వరరావు, పి.కృష్ణ, గోపి, మేరి, ఎం.శివసాంబిరెడ్డి, వై.బ్రహ్మేశ్వరరావు, వెంకటప్పరెడ్డి, జె.బాలరాజు, సిహెచ్ పోతురాజు, బి.అమ్మిరెడ్డి పాల్గొన్నారు.


తాడేపల్లి


దుగ్గిరాల


మాట్లాడుతున్న పిన్నమనేని మురళికృష్ణ

ఆడాలి, పాడాలి, సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

విద్యార్థులు ఆటలతో పాటు అభ్యుదయకరమైన పాడాలని వీటితో పాటు సమయపాలన ముఖ్యమని విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ చెప్పారు. శనివాయం సాయంత్రం ముగ్గురోడ్డులో తాడేపల్లి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ట్యూషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కథలు వినడం ద్వారా పిల్లల్లో ఊహాశక్తి పెరుగుతుందని, మంచి కథలు నేర్చుకోవాలని సూచించారు. ఈ ప్రాంతంలో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో పిల్లలకు పెద్దఎత్తున బాలోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. బాలబాలికల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికే బాలల పండుగలు నిర్వహిస్తున్నామన్నారు. సులభంగా ఇంగ్లీషు నేర్చుకోవడంతో మ్యాథమేటిక్స్‌లో మెళకువలు మ్యాజిక్ లాంటి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంఘ పెద్దలు ఆర్.జడ్సన్ మాట్లాడుతూ పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ట్యూషన్ పాయింట్ విజయవంతానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి విజ్ఞాన కేంద్రం కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి, స్థానికులు లీలమ్మ, గోపమ్మ, లలితమ్మ, శారమ్మ, ఉపాధ్యాయిని ఝాన్సీ పాల్గొన్నారు.


బహుమతులు అందచేస్తున్న ఎమ్మెస్కే ప్రసాద్, తదితరులు

లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలి

విజ్ఞాన్ మహోత్సవ్ ముగింపు సభలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు మండలం, వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో గత మూడు రోజులుగా నిర్వహించిన విజ్ఞాన్ మహోత్సవ్ ఘనంగా ముగిసింది.. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో యూనివర్సిటీ ప్రాంగణం పండుగ వాతావరణం నెలకొన్నది. వివిధ పోటీల్లో విజేతలకు రూ.15 లక్షల నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన నటుడు కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ జీవితంలో ఏం సాధించాలను కున్నారో అది సాధించాలని, ఎప్పుడు నవ్వుతూ సంతోషంగా ఉండాలన్నారు. ఇండియన్ నేషనల్ క్రికెట్ టీమ్ మాజీ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి జీవితంలో నిర్దిష్టమైన లక్ష్యం ఉండాలని, దానిని సాధించే వరకూ అవిశ్రాంతంగా కృషి చేయాలన్నారు. మారుతున్న జీవనశైలిలో ప్రతి ఒక్క విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలంటే ఏదో ఒక క్రీడలో మక్కువ చూపాలన్నారు. సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ మాట్లాడుతూ మీకు ఏం కావాలో మీ మనసుకు తెలిసినంతగా మరెవరికీ తెలియదన్నారు. ప్రతి మనిషిలో రైటర్, డైరెక్టర్, యాక్టర్, డాక్టర్, పొలిటీషియన్, ఇంజినీరు ఉంటారని, అందులో మీలో ఎవరున్నారనేది మీకే తెలియాలని అన్నారు. విజ్ఞాన్స్ ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ భవిష్యత్ ప్రజలంతా ఎంటర్‌టైన్మెంట్ రంగంవైపు రావటానికి ప్రయత్నిస్తారన్నారు. వినూత్న ఆలోచనలకు టెక్నాలజీని ఉపయోగించుకుంటే జీవితంలో ముందుకు దూసుకెళ్లొచ్చ న్నారు. అనంతరం 75 రకాల ఈవెంట్లలో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.


మాట్లాడుతున్న కిరణ్ అబ్బవరం

రైల్వే అధికారుల దూకుడు... దీటుగా బాధితులు...

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని రైల్వే స్థలాల్లో పేదల ఇళ్లను తొలగించడానికి రైల్వే అధికారులు దూకుడు పెంచారు. 24 గంటల్లో తట్టాబుట్టా సర్దుకోవాలని లేకపోతే ఇళ్లు కూల్చి వేస్తామని శనివారం మైకు ప్రచారం నిర్వహించారు. దీంతో బాధితుల్లో ఆందోళనతో పాటు ఆగ్రహం పెల్లుబీకింది. శనివారం ఉదయం ఐదు గంటల నుంచే సిపిఎం, సిపిఐ, వైసిపి, టిడిపి, కాంగ్రెస్ నాయకులు రైల్వే సిబ్బంది వస్తే ఎదుర్కోవడానికి, వారికి ధీటుగా జవాబు ఇవ్వడానికి వార్డుల్లో బాధితులను సిద్ధపరిచారు. పేదలు కూడా తమ పనులు మానుకుని బుల్డోజర్ వస్తే అడ్డుపడటానికి సిద్ధమయ్యారు. దీంతో శనివారం రైల్వే అధికారుల వైపు నుండి ఎటువంటి ప్రతిఘటనా ఎదుర్కోకపోవడంతో పేదలు ఊపిరి పీల్చుకున్నారు. ఎప్పుడొచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధమేనని బాధితులతో పాటు వివిధ రాజకీయ పార్టీలు ప్రకటించాయి. కార్యక్రమంలో సిపిఎం పట్టణ రూరల్ కార్యదర్శులు బి.వెంకటేశ్వర్లు, డి.వెంకటరెడ్డి, నాయకులు, కె.బాబురావు, డివి భాస్కర్‌రెడ్డి, వైసిపి నాయకులు ఇ.డేవిడ్‌రాజు, ఎం.వివేకానందరెడ్డి, కె.రాజశేఖరరెడ్డి, ఎం.వెంకటరామిరెడ్డి, ఎం.ప్రకాష్, సిపిఐ నాయకులు కె.కాశయ్య, టి.వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు డి.సామ్యేలు, టిడిపి నాయకులు వి.వెంకట్రావు పాల్గొన్నారు.



కౌలు రైతులకు ఊరట

ప్రజాశక్తి - దుగ్గిరాల

డెల్టా ప్రాంతంలో 70 శాతం ఉన్న కౌలు రైతులకు ఊరట కలిగించే విధంగా నిబంధనలు సడలించినట్లు తెలుస్తోంది. స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో కోల్డ్ స్టోరేజ్‌లో నష్టపోయిన పసుపు రైతుల నుండి కోల్డ్ స్టోరేజ్ వారు జారీ చేసిన బాండ్ ఆధార్ కార్డు తీసుకుంటున్నారు. ఇది గుర్తింపు కార్డులు లేని కౌలురైతులకు ఊరట కలిగించే విషయం. చిన్నచితక వ్యాపారస్తులు, పసుపు కోట్లలో పనిచేసే గుమస్తాలు ధరలు పెరుగుతాయని ఆశతో చాలా కొద్ది మొత్తంలో నిలువ చేసుకుంటారు. వీరు ఇన్కమ్ టాక్స్ పరిధిలోనికి రారు. ఇటువంటి వారికి కూడా ప్రస్తుతం మేలు చేకూరే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా కోల్డ్ స్టోరేజ్‌లో పంట నిల్వ చేసి నష్టపోయిన రైతులు వివిధ ప్రాంతాల నుండి వచ్చి యాడ్ సిబ్బందికి వివరాలు అందజేస్తున్నారు.



తహశీల్దార్ హత్యపై రెవెన్యూ సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - తెనాలి

విశాఖపట్నంలో తహశీల్దార్ ఎస్.రమణయ్య శుక్రవారం హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో హత్యను నిరసిస్తూ శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారిని అత్యంత కిరాతకంగా హతమార్చటం దారుణమని, ఈ ఘటన ఉద్యోగుల్లో తీవ్ర భయాందోళనలను రేకెత్తిస్తోందని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



టిజెపిఎస్ విద్యార్థులు రక్తదానం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పట్టాభిపురంలోని టిజెపియస్ కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థులు ఆపదలో ఉన్న హార్ట్ పేషెంట్‌కు రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడారని కళాశాల ప్రిన్సిపాల్ మేజర్. ఎబిపి మనోహర్ తెలియచేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన మొదటి సంవత్సరం బీఎస్సీ విద్యార్థులు ఇసాక్, యువరత్నను ప్రిన్సిపాల్ అభినందించారు. యువత రక్తదాన ఆవశ్యకత గురించి తెలుసుకుని సాటి మనిషికి సహాయం చేసే ధృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం పేర్కొన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి డాక్టర్. జె.వి.సుధీర్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ నిర్వహణాధికారి ఆర్.జయశైలజ తదితరులున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు నారాకోడూరు విద్యార్థులు

ప్రజాశక్తి - చేబ్రోలు

జాతీయస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు నారాకోడూరు జెడ్‌పి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.ఏడుకొండలు శనివారం తెలిపారు. ఈనెల 7వ తేదీ నుండి రాజస్థాన్‌లో జరగబోయే సబ్ జూనియర్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరపున తమ పాఠశాల విద్యార్థులు పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. బాలుర జట్టుకు కె.డేవిడ్‌రాజు, బాలికల జట్టుకు కె.వెన్నెల, డి.ఎరూష ఎంపికయ్యారని పిఇటి ఉమామహేశ్వరి, వెంకటేశ్వర్లు తెలిపారు.



ఉచితంగా టార్పాలిన్ పట్టాలు అందజేత

ప్రజాశక్తి-ముప్పాళ్ల


మండలంలోని గోళ్ళపాడులోని ఎస్టీ యానాది కాలనీలో 20 కుటుంబాలకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సెంటర్ ఏరియా కో ఆర్డినేటర్ మేడే వెంకటరమణ టార్పాలిన్ పట్టాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్టీ కాలనీలో మిచౌంగ్ తుఫాన్ వల్ల వర్షపు నీరు గుడిసెలలో చేరి పాడైపోయాయని, అక్కడ ఉండేందుకు అవకాశం లేనంతగా నీట మునిగి కాలనీ వాసులు ఇబ్బంది పడ్డారన్నారు. ఈ సందర్భంగా వర్షాలు కురిసే సమయంలో ఎవరికైతే ఇబ్బంది ఉందో ఆ కుటుంబాలను గుర్తించి టార్పాలిన్ పట్టాలను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ డేవిడ్,మాజీ సర్పంచ్ కుమారి,కమ్యూనిటీ లీడర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



10న ఆర్‌విైఎస్ జిల్లా ప్రథమ మహాసభ

ప్రజాశక్తి-వినుకొండ

ఈ నెల10వ తేదీన నరసరావుపేటలో రాష్ట్ర విద్యార్థి యువసేన (ఆర్‌వి వైఎస్) ఆధ్వర్యంలో జరిగే మొట్ట మొదటి జిల్లా మహాసభ ను జయప్రదం చేయాలని ఆర్‌విైఎస్ అధ్యక్షులు సంపెంగుల రవికుమార్ కోరారు. కారంపూడి రోడ్డు లోని ఆర్‌విైఎస్ కార్యాలయంలో శనివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు విద్యా వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు వసతి దీవెన,ఫీజ్ రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందించకపోవడం వల్ల ఎంతో మంది విద్యార్థులు వారి చదువులు(డిగ్రీలు) అయిపోయిన తరువాత కూడా సర్టిఫికెట్లు తెచ్చుకోలేక, వేలకు వేలు ఫీజులు కట్టలేక కూలీ పనులు చేసుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్స్ లో ఉంటున్న విద్యార్థులకు సరైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని, ప్రైవేట్ కళాశాలలో చదివే విద్యార్థులకు సకాలంలో ఫీజులు చెల్లించి, విద్యార్థులకు, యాజమాన్యాలకు న్యాయం జరిగేలా పోరాడతామని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌విైఎస్ నాయకులు ఆర్.రాజు, టి.నాగేంద్రబాబు, బి.నరేంద్ర,మహేష్ చారిలు పాల్గొన్నారు.



టిడిపి నేతల ఆర్థికసాయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

గత గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమావత్ బుజ్జిబాయ్ కుటుంబాన్ని టిడిపి నాయకులు శనివారం పరామర్శించారు. చింతల తండాలోని మృతురాలి స్వగృహానికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కుర్రి శివారెడ్డి, నేరేటి వీర స్వామి యాదవ్, మూడవత్ వజ్రం నాయక్, రెడ్యానాయక్, గుండాల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

వికలాంగులు, అంధుల సమస్యలను పరిష్కరిస్తా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా





వికలాంగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శని వారం నిర్వహించిన వికలాంగులతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన 70 మందికి పైగా వికలాంగులు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కు వినతి పత్రాలను సమర్పించారు. ముందుగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి కలెక్టర్ నివాళులర్పించారు. వికలాంగుల సమస్యలను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి నెలా 4వ తేదీన వికలాంగులు, అంధులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల కోసం ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని చెప్పారు. సమావేశానికి విచ్చేసిన వికలాంగులకు, భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో డిఆర్ఓ వినాయకం, జిల్లా డిజేబుల్ వెల్ఫేర్ ఏడి సువార్త, డిఎంహెచ్ఓ రవి, డి.సి. హెచ్.ఎస్ రంగారావు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ కేంద్రాలపై ప్రత్యేక నిఘా : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా స్థాయి మల్టీ మెంబెర్ అప్రోప్రైట ఆధారిటీ మరియు డిస్టిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సంయుక్త సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్.ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో శనివారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన కమిటీ చైర్‌పర్సన్, కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం 1994 సమర్థవంతంగా అమలు చేయాలని, ఈ చట్టం పరిధి అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే చట్ట పరిధిలో శిక్షార్హులవుతారని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటివరకు 161 ప్రైవేటు ,ప్రభుత్వ ఆసుపత్రులు లింగ నిర్ధారణ చటం పరిధి కింద అనుమతులు తీసుకున్నట్లు చెప్పారు. వీరందరూ కూడా చట్ట ప్రకారము నిబంధనలకు లోబడి అన్ని రకాల రికార్డులను సక్రమంగా అమలు చేయాలని అన్నారు. జిల్లాలో కొత్తగా 4 స్కాన్ సెంటర్లకు, 10 రెన్యువల్స్ కు, 9 మార్పుల కోసం నమోదు చేసుకున్న వారికి లింగ నిర్ధారణ చట్టం కింద అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి. గీతాంజలి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ రంగారావు,మహిళా సంఘం నాయకురాలు డి.శివకుమారి, రెడ్ క్రాస్ సభ్యులు డాక్టర్ ఎం.వసంత కిరణ్, దిశ డిఎస్పీ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్థానచలనం లేని పోలీసులను బదిలీ చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



అదనపు ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న అరవిందబాబు

నరసరావుపేట నియోజకవర్గంలో కొన్నేళ్లుగా స్థాన చలనం లేకుండా పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను రానున్న ఎన్నికల దృష్ట్యా బదిలీ చేయాలని జిల్లా అడిషనల్ ఎస్పీకి నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో పోలీస్ శాఖలో ఉన్న ఉద్యోగులను బదిలీ చేయకుంటే వారు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించి రిగ్గింగ్ కు పాల్పడి అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల సమయానికి ప్రభుత్వ అధికారులను బదిలీ చేయడం ఆనవాయితీగా వస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. లా అండ్ ఆర్డర్ ను కాపాడాలన్నా, నియోజకవర్గంలో ఎన్నికలు సజావుగా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాలన్నా స్థాన చలనం లేని పోలీసులను బదిలీ చేయాలన్నారు. ఈ విషయమై పోలీసు అధికారి చర్యలు తీసుకోకుంటే ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని అరవిందబాబు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గూడూరు శేఖర్,చింతిరాల బాలు,మొహమ్మద్ రఫీ, మాబు, శివప్రసాద్,చల్లగుండ్ల హరిక్రిష్ణ పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



మాట్లాడుతున్న పిడిఎం నాయకులు వైవి

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2023ను రద్దు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ హెచ్చరించారు. స్థానిక కోటప్పకొండ రోడ్ లోని సిపిఎం కార్యాలయంలో ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2023 ను రద్దుపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి పిడిఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల హక్కులను హరించి, కార్పొరేట్ శక్తులకు భూములను అప్పగించే దాంట్లో భాగమైన చట్టాన్ని రద్దు చేయకపోతే రైతులు, ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పిడిఎం రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అనేక అక్రమాలు చేస్తున్న రెవెన్యూ యంత్రాంగానికి భూముల విషయం అప్పజెప్పడం అంటే దొంగ చేతికి తాళం ఇచ్చినట్లుగా ఉందన్నారు. భూములపై సమస్యలు పరిష్కారానికి స్థానిక కోర్టులకి వెళ్లే అవకాశం ఈ చట్టం లేకుండా చేస్తుందని అన్నారు. మండల స్థాయి నుండి కలెక్టర్ సాయి వరకు ల్యాండ్ టైటిలింగ్ అధికారులను నియమించి వారి ద్వారా ఈ ప్రభుత్వం ఆస్తులను తమ కనుసన్నల్లో ఉంచుకోవాలని చూస్తుందన్నారు. సమావేశంలో రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, జి రామకృష్ణ, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె. కృష్ణ, ఎంసిపియు జిల్లా కార్యదర్శి రెడ్ బాష, భారత బచావో జిల్లా అధ్యక్షులు వి. కోట నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని చందవరంలో పిల్లా బ్రహ్మయ్య తల్లి సామ్రాజ్యం భౌతికకాయాన్ని వైసిపి నాయకులు మల్లెల కోటేశ్వరరావు సందర్శించి శనివారం నివాళులర్పించారు. అనారోగ్యం కారణంగా శనివారం ఆమె మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని బ్రహ్మయ్యకు అందజేశారు.



'ఎఎం రెడ్డి స్మారక ఫార్మసీ'లో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా



ముద్దం వివేకానంద రెడ్డిని సత్కరిస్తున్న అట్లూరి శాంతి శ్రీనివాస రెడ్డి

నరసరావుపేట మండలంలోని పెట్లూరి వారిపాలెం గ్రామ పరిధిలోని ఎఎంరెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో శని వారం కంటి పరీక్షలు నిర్వహించారు. కళాశాల విద్యార్థినీవిద్యార్థులకు, సిబ్బందికి నరస రావుపేట ఎంవిరెడ్డి కంటి హాస్పిటల్ అధినేత డాక్టర్ ముద్దం వివేకానంద రెడ్డి ఈ పరీక్షలు నిర్వహించి, కంటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ శిబిరాన్ని కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేకానంద రెడ్డి మాట్లాడుతూ శరీర అవయవాలలో అతి సున్నితమైన కంటిని జాగ్రత్తగా చూసుకోవాలని, సమయానికి నిద్రపోవడం,సెల్‌ఫోన్, టివి, కంప్యూటర్‌ను అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. అతిగా వినియోగిస్తే కంటి నరాలు దెబ్బతిని చిన్న వయసులోనే కంటి చూపు లోపించే ప్రమాదం ఉందన్నారు. నేటి డిజిటల్ యుగంలో యువత చిన్న వయసులోనే కంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పౌష్టికాహార లోపంతో కంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని నివారించడం కోసం ప్రస్తుతం యువతకు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు తమ దైనందిన జీవితంలో తోటి స్నేహితులతో కలిసి ఆటలు ఆడాలని ఆటల వలన మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల ఆధ్వర్యంలో సమాజానికి ఉపయోగపడే ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి భార్గవ భూషణ్ రావు, కళాశాల అకడమిక్ డీన్ డాక్టర్ ఎం లక్ష్మీ సురేఖ, విభాగాధిపతి డాక్టర్ కిరణ్, ఎస్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ జి సందీప్ పాల్గొన్నారు.

దేవానాయక్‌పై దాడి హేయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గుంటూరులోని సిఆర్ నగర్ (చంద్ర రాజేశ్వరరావు నగర్)కు చెందిన ఎస్టీ నాయకులు యన్. దేవానాయక్‌పై 26వ డివిజన్ కు చెందిన కార్పొరేటర్ శ్యామల వెంకటరమణా దేవి, ఆమె భర్త బ్రహ్మారెడ్డి అనుచరులు హత్యాయత్నం చేయడం అమానుష చర్య అని ఎపి గిరిజన సంఘ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శీనునాయక్ అన్నారు. స్థానిక ఎన్ ఆర్ టి సెంటర్‌లో తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించినట్లు చెప్పారు. భార్య కార్పొరేటర్ అయితే భర్త పెత్తనం ఎక్కువైపోయిందని, గ్రావెల్ మాఫియాను పెంచి పోషించడమే కాకుండా వారు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని, ఈ విషయమై ప్రశ్నిస్తున్న దేవా నాయక్ కుటుంబ సభ్యులపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జాతీయ ఎస్టీ కమిషన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయిస్తామని, న్యాయ పోరాటం చేసేందుకు వెనుకాడబోమని అన్నారు. పోలీసులు న్యాయ బద్ధమైన విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు

ప్రజాశక్తి-గుంటూరు

అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అన్నారు. శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 18వ డివిజన్ ఆర్.అగ్రహారం శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం మెయిన్ రోడ్డు నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు రూ.85 లక్షల ఎన్‌క్యాప్ నిధులతో జిఎంసి నిర్మిస్తున్న సి.సి రోడ్లు, సి.సి డ్రైన్లు, తాగునీటి పైపులైన్ పనులు, ఆక్రమణలను అధికారులు స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించారు. అధికారులు, స్థానిక ప్రజలతో సమావేశమై అభివద్ధి పనుల నిర్వహణపై చర్చించారు. ఆర్.అగ్రహారంలో చాలా సంవత్సరాల క్రితం వేసిన రోడ్లు, డ్రైన్లు పాడయ్యాయని, కావున నూతన రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో స్థానికుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని చెప్పారు. ఆక్రమణల తొలగింపులో స్థానిక ప్రజలకు ఎక్కువగా నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నగరంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, స్థానిక పెద్దలు అశోక్ జైన్, మహావీర్‌జైన్, కూనిశెట్టి మదన్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న మేయర్ మనోహర్

వైసిపికి దాసరి రంగారావు రాజీనామా

ప్రజాశక్తి - తుళ్లూరు



మండలం లోని హరిశంద్ర పురానికి చెందిన దాసరి రంగారావు వైసిపికి రాజీనామా చేశారు. రంగారావు తన సన్నిహితులతో తుళ్లూరులో శనివారం సమావేశమయ్యారు. ఆరేళ్లుగా వైసిపిలో క్రియాశీలకంగా పనిచేశానని, ప్రస్తుతం తాడికొండ మార్కెట్ యార్డ్‌లో డైరెక్టర్‌గా కొనసాగుతున్నానని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులు అంటూ అసంబద్ధ వైఖరి అవలంభించడం, కాపులను టార్గెట్ చేయడం తదితర కారణాలతో అసంతృప్తి చెంది పార్టీ సభ్యత్వానికి, డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. తనతో పాటు మరికొంత మంది పార్టీని వీడనున్నారని చెప్పారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్, నియోజకవర్గ సమన్వయ కర్త మేకతోటి సుచరితకు పంపుతున్నట్లు చెప్పారు.



చేనేత భవనాన్ని నెలాఖరులోగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్లో రూ.5.5 కోట్లతో నిర్మాణం చేపట్టిన చేనేత భవనం పనులను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసిపి నియోజకవర్గం ఇంచార్జ్ గంజి చిరంజీవి శనివారం పరిశీలించారు. ఈ నెలాఖరులోపు నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభిస్తామని వారు చెప్పారు.



వెల్డింగ్ మెషిన్లు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని 13, 28, 29 వార్డులకు చెందిన ఫాబ్రికేషన్ వర్కర్లు పఠాన్ ఇమ్రాన్ ఖాన్, షేక్ అహ్మదా, శీలం ప్రభాకర్, షేక్ అబ్దుల్ రెహ్మాన్, షేక్ ఖాదర్‌వలికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో శనివారం వెల్డింగ్ మిషన్లను శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె. శ్రీఅనిత, జి.దుర్గారావు, షేక్ రియాజ్, ఎ.భూలక్ష్మి, ఎం.వైష్ణవి, డి.సత్యానందం,షేక్ సుభాని పాల్గొన్నారు.

నేడు తక్కెళ్లపాడులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని తక్కెళ్లపాడు శివాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని డివిసి హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాని కోరారు.

విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలి

ప్రజాశక్తి-మంగళగిరి

విద్యార్థుల్లో సేవాభావం కలిగి ఉండాలని విజె కళాశాల కరస్పాండెంట్ పి.రాజశేఖర్ అన్నారు. జాతీయ సేవాభాగం (ఎన్ఎస్ఎస్), మంగళగిరి విజె డిగ్రీ కళాశాల విద్యార్థులు అలాంటి మంచి విలువలు కలిగి ఎందరికో ఆదర్శంగా నిలవడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. మంగళగిరి సమీపంలోని ఆత్మకూరులో గత మూడు రోజులుగా ప్రోగ్రామ్ ఆఫీసర ఎస్.శంకర్ నేతత్వంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మూడవరోజు గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో వెంకటేశ్వర ఆప్టికల్స్ మంగళగిరి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేసి సుమారు వందమందికి పైగా కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాదెళ్ల శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ సీతామహాలక్ష్మి, వీఆర్వో, వాలంటీర్లు పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్యశిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు



ఇళ్ల బిల్లులను సకాలంలో ఇవ్వండి

ప్రజాశక్తి - చేబ్రోలు

హౌసింగ్ డే సందర్భంగా స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఇన్‌ఛార్జి ఎంపీడీవో జి.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని సిబ్బందికి చెప్పారు. చేబ్రోలు-5 కొత్తరెడ్డిపాలెం గ్రామ సచివాలయ పరిధిలోని కాలనీలో ఇంటి నిర్మాణం ప్రారంభించిన లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇంటితోపాటు వ్యక్తిగత మరుగుదొడ్డి, సోక్ పిట్లను నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఎస్‌కె జిలానిబాష, వర్క్ ఇన్‌స్పెక్టర్ పి.మల్లికార్జునరావు, మండల కో-ఆర్డినేటర్ జి.ప్రసాదరావు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రిని అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండల పరిధిలోని అన్నపర్రు బి.వి.ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-05 పదో తరగతి విద్యార్థులు ఈ సంవత్సరం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 28 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని సమకూర్చారు. వీటిని పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్ఎం జి.అజరయ్య మాట్లాడుతూ విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థుల చేస్తున్న సాయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.చంద్రశేఖర్, కె.నరసింహా రావు, ఎం.వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మంగళగిరికి కొత్త తహశీల్దార్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నూతన తహశీల్దార్‌గా వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకూ పని చేసిన జివి.రాంప్రసాద్ టూరిజం విభాగానికి బదిలీ అయ్యారు.



విజయకీలాద్రి వార్షిక బ్రహ్మోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తాడేపల్లి

సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఈ నెల 13 నుండి 18వ తేదీ వరకు ఏడో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు త్రిదండి అహోబిళ రామానుజ జీయర్ స్వామి తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం సీతానగరం చిన్న జీయర్ స్వామి ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ శ్రీ మదుభయ వేదాంతాచార్య పీఠం ఆధ్వర్యంలో విజయకీలాద్రి దివ్య క్షేత్రంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ప్రారంభిస్తారని తెలిపారు. 15న సామూహిక లక్ష్మీనారాయణ పూజ, 16న గరుడ వాహనంపై వేలాది మందితో విజయకీలాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బలహీనవర్గాల అభ్యున్నతి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. గుంటూరులోని 49వ డివిజన్‌లో శనివారం సాయంత్రం పర్యటించారు. చంద్రమౌళి నగర్ పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బాణసంచా పేలుళ్ల, డీజే మోతలు, తీన్‌మార్ చప్పుళ్లతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. మంత్రి మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు చెందిన తనను గుంటూరు పశ్చిమ సమన్వయకర్తగా ఎంపిక చేశారని, వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరు నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఐటీని కూడా గుంటూరులో అభివద్ధి చేసే విషయంలో కృషి చేస్తానని చెప్పారు. అనంతరం మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు, డిసిసిబి చైర్మన్ ఆర్.సీతారామాంజనేయులు మాట్లాడారు.

10, 11 తేదీల్లో జాతీయ నాస్తిక మేళా

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్

మండలంలోని నిడమర్రు చార్వాకా ఆశ్రమంలో ఈనెల 10, 11 తేదీల్లో 32 వ జాతీయ నాస్తిక మేళాను నిర్వహిస్తున్నట్లు నాస్తిక సమాజం నిర్వాహకులు శనివారం తెలిపారు. చార్వాక ఆశ్రమం ఏర్పాటు చేసి 50 ఏళ్ల నిండిన సందర్భంగా రెండ్రోజులపాటు జరిగే మేళాలో దేశవ్యాప్తంగా పలువురు నాస్తికులు, ప్రముఖులు హాజరుకానున్నారని చెప్పారు. మొదటి రోజు శాస్త్రీయ ధృక్పథం, మహిళా చైతన్యం -శాస్త్రీయ ధృక్పథం, అతి సూక్ష్మ ప్రపంచం కత్రిమ మేధ- మానవాళికి మేలా?, సామ్రాజ్యవాదం- యుద్ధాలు, మూడ విశ్వాసాలు - నిర్మూలన, ఆహారం-ఆరోగ్యం, మనసు సష్టించే భయాలు- భ్రమలు, నాస్తిక కార్యాచరణ వారి అనుభవాలు కర్తవ్యాలు అనే అంశంపై మొదటి రోజు ఉపన్యాస కార్యక్రమాలు ఉంటాయన్నారు. రెండవ రోజు పెరియార్ సిద్ధాంతం - దాని సామాజిక ఆచరణ - ప్రాసంగికత, మా మన మానవ మూలాలు, మొదటి సోషలిస్టు రాజ్యంలో మతము-మత విశ్వాసాలు, భారతీయ సమాజం -మానసిక బానిసత్వం, మత గ్రంథాలు-పరిశీలన అనే అంశాలపై రెండవ రోజు ఉపన్యాస కార్యక్రమాలు ఉంటాయన్నారు. కళాకారులచే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలూ ఉంటాయని తెలిపారు.



ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి మంగళగిరి రూరల్

దక్షిణాది ప్రసిద్ధిగాంచిన భగవాన్ శ్రీ సత్య శిరిడి సాయిబాబా మందిరం 18వ వార్షికోత్సవం ఆలయ కమిటీ చైర్మన్ శ్రీ పాతూరి నాగభూషణం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి పాలాభిషేకంతో పాటు రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మ ప్రచారక్ ఆధ్వర్యంలో అన్నాభిషేకం నిర్వహించారు. సందర్శకులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డి.పురందేశ్వరి, మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, పి.పుల్లారావు, సిసోడియా, ఎమ్మెల్సీ ఎం.హనుమంతరావు, టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, ఐలాపురం రాజా, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజివి, బ్రహ్మపదం శ్రీకృష్ణమాచార్య స్వామీజీ, పాటిబండ్ల రామకృష్ణ, లంక దినకర్, హాజరయ్యారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసిన అందరికీ ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం ధన్యవాదాలు తెలిపారు.



ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

ఇటీవల రోటరీ క్లబ్ పెదనందిపాడులో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య చికిత్స శిబిరంలో పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి 57 మందికి ఐఓఎల్ అద్దాలు ఏర్పాటు చేసింది. వీటిని శనివారం స్థానిక అశోక హైస్కూల్లో డాక్టర్ ఆదిత్య డాక్టర్ బిపిన్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా అందించారు. రోటరీ జిల్లా లిటరసీ విభాగం చైర్మన్ పోపూరి లక్ష్మీనారాయణ ద్వారా వీటిని ఇచ్చారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు కె.నాగేశ్వరరావు ఎన్.శివప్రసాద్ పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే విఆర్ఎలకు డిఎ జిఒ

ప్రజాశక్తి-గుంటూరు

పోరాట ఫలితంగా విఆర్ఎలకు డి.ఏ జీవో విడుదల అయ్యిందని ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వడ్డే బాజీబాబు, షేక్.నాగుల్‌మీరా, కోశాధికారి పి.జయపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన ఇతర హామీల అమలుకూ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గతేడాది సెప్టెంబర్‌లో విఆర్ఎల ఛలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వం రూ.500ల డిఎను కొనుసాగిస్తామని ఇచ్చిన హామీ ఇచ్చి ఐదు నెలలు అవుతున్నా జిఒ ఇవ్వకపోవటంతో ఈ ఏడాది జనవరి 5న మంగళగిరి సిసిఎల్ఎ కార్యాలయం వద్ద వేలాది మందితో మరోసారి ఆందోళన చేసినట్లు చెప్పారు. ఈ ఆందోళన పోరాటాల ఫలితంగానే శుక్రవారం జిఒ ఇచ్చారన్నారు.మరోసారి పోరాటానికి సిద్ధం అవుతున్న తరుణంలో జిఒ రావటం శుభపరిణామం అన్నారు. పోరాటంలో పాల్గొన్న వారికి అభినందనలు తెలిపారు. విఆర్ఏల ప్రధాన డిమాండ్ అయిన తెలంగాణ మాదిరిగా పేస్కేల్, నామినీగా పనిచేస్తున్న వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని, వీఆర్వో, రికార్డ్ అసిస్టెంట్, అటెండర్, వాచ్మెన్, స్వీపర్ పోస్టులలో 30శాతం, 20శాతం ఉన్న పర్సంటేజ్‌ని 70 శాతానికి పెంచి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి పోరాటానికి సిద్ధం కావాలన్నారు.



పురస్కారం అందుకుంటున్న మహబూబ్ సుభాని, కాలేషాబి మహబూబ్ దంపతులు

నాగరత్నమ్మ పురస్కారం అందుకోవటం గర్వకారణం

ప్రజాశక్తి-గుంటూరు

సుప్రసిద్ధ నాదస్వర విద్వాంస దంపతులు పద్మశ్రీ షేక్.కాలేషాబి మహబూబ్ సుభాని తమ జీవితాన్ని సాహిత్య, కళాపోషణకు అంకితం చేసిన విద్యా సుందరి బెంగళూరు నాగరత్నమ్మ స్మారక పురస్కారం అందుకోవటం సంతోషకరమని తమిళనాడులోని శ్రీరంగంకు చెందిన సుప్రసిద్ధ నాదస్వర విధ్వాంస దంపతులు పద్మశ్రీ, కలైమామణి షేక్.మహబూబ్ సుభాని, కాలేషాబి మహబూబ్ దంపతులు పేర్కొన్నారు.శనివారం స్థానిక బందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై విశ్వనాథ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో 'విద్యాసుందరి' బెంగళూరు నాగరత్నమ్మ స్మారక పురస్కారం 2024 సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వివిఐటి విద్యాసంస్థల ట్రస్ట్ బోర్డు సభ్యురాలు వాసిరెడ్డి అరుణప్రియ మాట్లాడుతూ 8 తరాలుగా నాదస్వర సరస్వతి సేవలో తరిస్తున్న దంపతులను గుంటూరు నగరంలో బెంగళూరు నాగరత్నమ్మ స్మారక పురస్కారం అందివ్వటం అదష్టంగా భావిస్తున్నామన్నారు.తొలుత దేవస్థాన కమిటీ అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య జ్యోతిప్రజ్వలన చేయగా, విశ్వనాథ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ మద్దినేని సింహ కౌటిల్యచౌదరి అధ్యక్షత వహించగా కార్యక్రమంలో కార్యదర్శి మోదుగుల రవికృష్ణ, కోశాధికారి డాక్టర్ సెట్లం చంద్రశేఖర్, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎంపికపై కొలిక్కిరాని టిడిపి కసరత్తు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో టిడిపి తరుపున పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై ఆ పార్టీ అధిష్టానం నిర్వహిస్తున్న కసరత్తు ఇంకా కొలిక్కిరాలేదు. వైసిపి సమన్వయకర్తల పేరుతో ప్రకటిస్తున్న అభ్యర్థుల జాబితాలను చూసి కొన్ని మార్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని టిడిపి నాయకులు అంటున్నారు. నియోజకవర్గాల వారీగా ప్రస్తుతం ఉన్న ఇన్‌ఛార్జిలకే టిక్కెట్‌లు ఇవ్వాలా లేక కొత్త వారికి అవకాశం ఇవ్వాలా? అనే అంశంపై వివిధ సర్వే సంస్థల ద్వారా టిడిపి సర్వే చేయిస్తోంది. ఇప్పటికే దరఖాస్తు చేసిన అభ్యర్థులలో ఒకరిద్దరు పేర్లను ఖరారు చేసి వారిపై ఫోన్ నెట్‌వర్కు ద్వారా ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రస్తుత ఇన్‌ఛార్జి నశీర్ ఆహ్మద్‌తో పాటు ఆరా సంస్థ నిర్వాహకులు షేక్ మస్తాన్ అభ్యర్థిత్వంపై సర్వే చేశారు. పలు నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జిలుగా ఉన్నవారితోపాటు కొత్త వారి పేర్లతో ఫోన్ సర్వే కొనసాగిస్తున్నారు.

గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో టిడిపి ఘోరపరాజయం చెందడంతో ఈసారి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రతి నియోజకవర్గాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. రాజధాని జిల్లాలో తమ సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వారిలో ఆరేడు మందికి ఈసారి అవకాశం ఇవ్వకపోవచ్చునంటున్నారు. జనసేనతో పొత్తు నేపథ్యంలో సీట్ల సర్ధుబాటుపై స్పష్టత రాలేదు. అయితే బిజెపితో కూడా పొత్తు ఉంటుందనే భావనతో అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రావడం లేదని టిడిపి సీనియర్‌లు చెబుతున్నారు. పొత్తుల వ్యవహారం తేలకపోవడం టిడిపి నాయకులకు తలనొప్పిగా మారింది.

వైసిపికి రాజీనామా చేసిన లావు శ్రీకృష్ణదేవరాయులు టిడిపిలో చేరకుండానే నర్సరావుపేట టిక్కెటు ఖరారు చేశారన్న వార్తలు సీనియర్లలో చర్చనీయాంశంగా మారింది. ఎన్ఆర్ఐ పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు లోక్‌సభకు ఎంపిక చేశారన్న ప్రచారమవుతోంది. మరోవైపు వైసిపి నర్సరావుపేట లోక్‌సభకు నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను, గుంటూరుకు ఉమ్మారెడ్డి వెంకటరమణను ఖరారు చేసింది. టిడిపి రెండు లోక్‌సభ స్థానాలు ఒకే సామాజిక తరగతికి ఇవ్వాలనే ఆలోచనపై జనసేన నాయకులు కొంత మంది అసంతృప్తిగా ఉన్నారు. గుంటూరులో కాపు నాయకులు ఇటీవల సమావేశం ఏర్పాటు చేసి కాపులకు ఎవరు ఎక్కువ సీట్లు ఇస్తే వారికి మా మద్ధతు ఉంటుందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో గుంటూరు లోక్‌సభ పాటు పొన్నూరు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాలను వైసిపి కాపులకు కేటాయించిందని, టిడిపి ఒక్కసీటు కూడా కాపులకు ఇవ్వకపోవడంపై జనసేనకు చెందిన కాపు నాయకులు అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. ఈ అంశాన్ని జనసేన నాయకులు పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల్లో టిడిపి సోషల్ ఇంజనీరింగ్ చేయకపోవడం వల్ల ఘోరపరాజయం చవిచూసిందని వారు గుర్తుచేస్తున్నారు. ఈసారి కూడా టిడిపిలో ఆ దిశగా అడుగులు పడటం లేదనే వాదన వినిపిస్తుంది.

వీక్షణం

1991లో గుంటూరు లోక్‌సభకు టిడిపి నుంచి లాల్‌జాన్‌బాషాను ఎంపిక చేయడం ద్వారా సీనియర్ నాయకుడు ఎన్.జి.రంగాను ఓడించగలిగామని టిడిపి సీనియర్లు గుర్తు చేస్తున్నారు. రెండులోక్‌సభ స్థానాలు ఒకే సామాజిక తరగతికి ఇవ్వడం రెండు సామాజిక తరగతులకు ఇస్తే కొత్త ఓటు బ్యాంకును ఆకర్షించడానికి అవకాశం ఉంటుందనే భావన టిడిపి సీనియర్లలో ఉంది. వైసిపికి ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్న దళితులు, మైనార్టీలను ఆకర్షించడంలో టిడిపి తగిన కసరత్తు చేయడం లేదని కానీ టిడిపి, జనసేనకు అనుకూలంగా ఉన్న కాపులను, బిసిలను ఆకర్షించడానికి వైసిపి భారీ కసరత్తుచేస్తున్న విషయాన్ని గమనంలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందని టిడిపికి చెందిన మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు.

(ఎ.వి.డి.శర్మ)

సినిమా చూపిస్తూ ఆపరేషన్!



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో న్యూరో సర్జరీ వైద్యులు రోగికి పోకిరి సినిమా చూపిస్తూ అరుదైన అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను ఉచితంగా చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం న్యూరాలజి సెమినార్ హాలులో విలేకర్లకు వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం ఐలాపురానికి చెందిన 48 ఏళ్ల పండు గతనెల రెండో తేదీన అపస్మారక స్థితిలో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. కుడి కాలు, కుడి చేయి బలహీన పడటంతో న్యూరో సర్జరీ ఓపీకి వచ్చారు. న్యూరో సర్జరీ వైద్యులు వివిధ పరీక్షలు చేసి ఆసుపత్రిలో 5వ తేదీన వార్డులో చేర్పించారు. ఎడమ వైపు మెదడు లో కుడి వైపున కాలు, చేయి పని చేసే మోటార్ కార్టెక్స్ భాగంలో కణితి ఉన్నట్లుగా స్కాన్‌లో వైద్యులు గుర్తించారు. అత్యంత సున్నిత భాగంలో ఉన్న ఆ కణితిని ఆపరేషన్ చేయాలనీ నిర్ణయించారు. ఈ ఆపరేషన్ చేయడం వల్ల పూర్తిగా కణితి తొలగించే ప్రక్రియలో కుడి కాలు, చేయి పూర్తిగా చచ్చుబడి పోయే అవకాశం ఉంటుదని వైద్యులు భావించారు. ఈ ఆపరేషన్ చేయాలంటే రోగి మెలుకువగా ఉన్నప్పుడు, కదులుతున్నప్పుడు ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది. ఈ ఆపరేషన్‌కు సహకరించి ముందుకు రావడంతో రోగి అభిమాని హీరో మహేష్‌బాబు నటించిన పోకిరి సినిమా చూపిస్తూ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో న్యూరో సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ కెవివి సత్యనారాయణ మూర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ గడ్డలా పెంచలయ్య, డాక్టర్ సురేంద్రవర్మ, డాక్టర్ సత్య నవమి ,పిజి వైద్య విద్యార్థులు డాక్టర్ కషుణుడు, డాక్టర్ సాయితేజ, డాక్టర్ మౌంట్‌రాజ్, డాక్టర్ మహేష్, మత్తు వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పోలయ్య, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ ఆదిత్య ప్రదీప్, డాక్టర్ ఆనంద్ పాల్గొన్నారు. ఆపరేషన్ తర్వాత రోగికి ఎలాంటి ఇబ్బందులూ లేకపోవడంతో పూర్తిగా కోలుకొని డిశ్చార్జి చేస్తున్నట్లు సూపరింటెండెంట్ చెప్పారు. రోగి కాలు చేయి బలహీనత పూర్తిగా తగ్గిపోయి సంపూర్ణంగా ఉన్నారని తెలిపారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభాకరరావు


ఐఓటీపై మహిళా పాలిటెక్నిక్‌లో శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' (ఐఓటి)పై మూడురోజుల శిక్షణిచ్చారు. విశాఖపట్నం ప్రోగ్స్ కంపెనీ నిర్వహించిన ఈ వర్క్‌షాపును కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరావు ప్రారంభించారు. కంపెనీ నుండి రిసోర్స్‌పర్సన్‌గా వారణాసి పవన్‌కుమార్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆధునిక మానవ జీవన వేగానికి అవసరమైన సాంకేతిక అవసరాలను అందించే టెక్నాలజీ 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, పారిశ్రామిక రంగంలో ఐఓటి ద్వారా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పరిశ్రమలు, వాహనాల యాంత్రీకరణకు, క్వాలిటీ కంట్రోల్, వస్తు రవాణా తదితర రంగాల్లో ఈ సాంకేతికతను ఇటీవల వాడుతున్నారన్నారు. వర్క్‌షాపులో డిప్లొమా రెండు, మూడో సంవత్సరం విద్యార్థినులు 108 మంది ఐఓటి పరికరాలతో ప్రత్యక్షంగా పనిచేస్తూ శిక్షణ పొందారన్నారు. కార్యక్రమాన్ని శిక్షణ కోఆర్డినేటర్లు రాజ్యలక్ష్మి, కిరణ్‌కాంత్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి రమాసుందరి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఈసీఈ సీనియర్ అధ్యాపకులు శ్రీవల్లి, గోమతి, కిరణ్మయి, ప్రభావతి పాల్గొన్నారు.

16న రవాణా కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు : రవాణా రంగ కార్మికులకు ఉరితాడుగా మారిన నూతన రవాణా చట్టం రద్దు చేయాలని ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మె, రవాణా బంద్ జయప్రదం చేయాలని రవాణా కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. శనివారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో రవాణా రంగ కార్మికుల జెఎసి సమావేశం షేక్.మస్తాన్‌వలి అధ్యక్షతన నిర్వహించారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.శివాజీ మాట్లాడుతూ హిట్ అండ్ రన్ పేరుతో డ్రైవర్ పొరపాటు ఉన్నా, లేకున్నా జరిగిన ప్రమాదాలకు బాధ్యత వహిస్తూ పదేళ్ల జైలు, రూ.10 లక్షలు జరిమానా విధిస్తున్నారని అన్నారు. సమ్మె గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని, లక్షలాది సంతకాల సేకరించాలని నిర్ణయించారు. జి.వి.రాజు, ఎం.శ్రీనివాసరావు, రాంప్రసాద్, ఎం.రవికుమార్, బి.లక్ష్మణరావు, షేక్ మీరావలి పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు


కెఎల్‌పి స్కూల్లో స్పెల్‌బి పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో శనివారం జిల్లా స్థాయి స్పెల్‌బి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి, న్యాయనిర్ణేత ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.రజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఉచ్చారణ భాషకు గుండెలాంటిదని, కావున ఇలాంటి పోటీలు విద్యార్థులను మంచి స్పెల్లర్‌గా, మంచి రీడర్‌గా మారుస్తుందన్నారు. వై.రధినీచౌదరి మాట్లాడుతూ ఆంగ్లభాష ప్రపంచ భాష అని, ఇలాంటి పోటీలు విద్యార్థులలో బాషావగాహన పెంపొందించుకోవటానికి తోడ్పడుతుందని చెప్పారు. ఈ పోటీలలో జిల్లాలోని 32 పాఠశాలల నుండి పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పోటీలలో ప్రథమ స్థానం డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్, ద్వితీయ స్థానంలో భాష్యం ఎంఐఐటి స్కూల్, తృతీయ స్థానంలో సెయింట్ జోన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ నిలిచింది. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.